

## అనాథ వృద్ధురాలికి అండగా మంథని పోలీసులు

మంథని, మే 21: (వుదయం ప్రతినిధి):మంథని పట్టణంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్ సందర్భంగా ఓ అనాథ వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు మానవత్వం చాటుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ వృద్ధురాలికి ఎవరూ లేరని, ఆమె అనాథ స్థితిలో జీవిస్తున్నారని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన మంథని సీఐ రాజు గౌడ్, ఎస్సై దేగ రమేష్ వెంటనే చర్యలు తీసుకుని ఏఎస్ఐ మల్లయ్యకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం వృద్ధురాలిని సురక్షితంగా కరీంనగర్‌లోని వీరభద్ర అనాథ వృద్ధాశ్రమానికి తరలించారు. అనాథ స్థితిలో ఉన్న వృద్ధురాలికి ఆశ్రయం కల్పించేందుకు పోలీసులు చూపిన చొరవపై స్థానికులు అభినందనలు తెలిపారు. పోలీసుల ఈ మానవతా స్పందన అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## పెద్దపల్లి సంక్షేమ శాఖలో అక్రమాల జరిగాయని హైకోర్టులో పిటిషన్

మంథని, మే 21వుదయం ప్రతినిధి పెద్దపల్లి జిల్లా సంక్షేమ శాఖలో ఆర్థిక, పరిపాలనా అక్రమాలు జరిగినట్లు ఆరోపిస్తూ తెలంగాణ హైకోర్టులో దాఖలైన డబ్ల్యూ పీ.14202/2026 పిటిషన్ ప్రస్తుతం విచారణలో ఉంది. ఈ పిటిషన్‌లో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి పి. వేణుగోపాలరావు సహా పలువురు అధికారులను ప్రతివాదులుగా చేర్చినట్లు పిటిషనర్ పుట్ట ముకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



మంథని పట్టణం ఎరుకలగూడెంకు చెందిన పుట్ట ముకేష్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్, విజిలెన్స్ కమిషనర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తదితర అధికారులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. పిటిషన్‌లో పేర్కొన్న ఆరోపణల ప్రకారం సంక్షేమ శాఖ పరిధిలో సుమారు రూ.23 లక్షల నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అదేవిధంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు, వేతనాల చెల్లింపులు, 05-12-2025 నాటి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసిన 16 పోస్టుల నియామకాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని ఆరోపించారు. అలాగే సంబంధిత వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో హైకోర్టును కోరినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కేసు పెండింగ్‌లో ఉండగా, విచారణ అనంతరం తదుపరి పరిణామాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అయన పేర్కొన్నారు.

## రాష్ట్ర డీసీసీ అప్రైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్‌కు సన్మానం



జన్నారం,మే 21(వుదయం విలేఖరి) జన్నారం ఏడీసీసీ బ్యాంకు అప్రైజర్ శ్రీరాముల గంగాధర్ తెలంగాణ డీసీసీ రాష్ట్ర అప్రైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఏడీసీసీ జన్నారం బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించారు. గురువారం రోజున ఉదయం బ్యాంకు ఆవరణలో మేనేజర్ అశ్విన్ కుమార్ ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బంది అనిల్, సాగర్, అనిత, లావణ్య, గంగాధర్ తదితరులు శ్రీరాముల గంగాధర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంగాధర్ సేవలను కొనియాడుతూ రాష్ట్ర స్థాయిలో పదవి రావడం జన్నారం బ్యాంకుకు గర్వకారణమని అన్నారు.

## చింతగూడ లక్ష్మీదేవి ఆలయానికి ఎక్స్‌ప్రెస్ స్టాప్ కల్పించాలని వినతి



జన్నారం, మే 21(వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని చింతగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ సుతారి సుమలత తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదిలాబాద్ డిప్యుటీ రిజనల్ మేనేజర్ శ్రీ హర్ష కు వినతి పత్రం సమర్పించారు. జన్నారం మండలం చింతగూడ గ్రామంలో ఎంతో పేరుగాంచిన పవిత్ర లక్ష్మీదేవి ఆలయం ఉందని, ఇక్కడ ప్రతిరోజు ఏటా వేలాది మంది భక్తులు దర్శనానికి వస్తుంటారని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం చింతగూడ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్టాప్ లేకపోవడంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చింతగూడ స్టేజి వద్ద ఎక్స్‌ప్రెస్ స్టాప్ మంజూరు చేయాలని సర్పంచ్ సుమలత గురువారం ఆర్టీసీ అధికారులను కోరారు. ఆమె వెంట మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ ఉన్నారు.

# దళితుల ఇళ్లపైనే నిర్లక్ష్యమా..?
## తాడిచర్ల ఎస్సీ కాలనీ ప్రజల ఆవేదన

మలహర్రావు, మే 21: (వుదయం ప్రతినిధి)తాడిచర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో వరుసగా ఇళ్లు కూలిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానిక దళిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. బొగ్గు తవ్వకాల కోసం ఏఎమ్మార్ సంస్థ నిర్వహిస్తున్న ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్‌ల తీవ్రత పెరగడంతో గోడలు పగిలిపోవడం, ఇండ్లు దెబ్బతినడం, కొన్ని చోట్ల పూర్తిగా కూలిపోవడం జరుగుతున్నా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.



"దళితుల ఇళ్లే కూలిపోతున్నా ఎందుకు అధికారులు స్పందించడం లేదు..? మా ప్రాణాలకు విలువ లేదా..? పేద ప్రజలమని చిన్నచూపు చూస్తున్నారా..?" అంటూ ఎస్సీ కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
ఇప్పటికే పలు ఇళ్లు బ్లాస్టింగ్ ప్రభావానికి గురికాగా, బుధవారం రోజున ఇందారపు బద్దయ్య ఇల్లు కూలిపోగా, గురువారం రోజున తాంద్ర సదానందం ఇంటి భాగాలు కూడా దెబ్బతిన్నట్లు గ్రామస్థులు తెలిపారు. వరుసగా ఇళ్లు కూలిపోతుండటంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయని చెప్పారు. ప్రతి బ్లాస్టింగ్ సమయంలో ఇండ్లు బలంగా కంపిస్తున్నాయని, చిన్నపిల్లలు, మహిళలు భయంతో బయటకు పరుగులు తీస్తున్నారని చెబుతున్నారు. బ్లాస్టింగ్ తీవ్రత పెరగడంతో ఇళ్లలో ఉండాలంటేనే భయంగా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనతో జీవిస్తున్నామని వాపోతున్నారు. తక్షణమే అధికారులు గ్రామాన్ని సందర్శించి పూర్తి స్థాయి సర్వే నిర్వహించాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, పక్కా ఇండ్లు మంజూరు చేయాలని, బ్లాస్టింగ్‌ల తీవ్రతను నియంత్రించే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రాణాలు పోయాక స్పందించడం కాకుండా, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఎస్సీ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

# పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో యూరియా సరఫరా, ధాన్యం రవాణాపై డీసీపీ సమీక్ష

పెద్దపల్లి, మే 21: (వుదయం కరస్పాండెంట్ న్యూస్)
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో యూరియా బస్తాల అన్‌లోడింగ్ ప్రాంతాన్ని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో పాటు హమాలీలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్చించారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణా కోసం అధిక సంఖ్యలో లారీలు వినియోగిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న యూరియా ఎరువుల రవాణాకు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు డీసీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాలకు చెందిన లారీ అసోసియేషన్ ప్రతినిధులతో డీసీపీ సమావేశమయ్యారు. వరి, మొక్కజొన్న రవాణా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించడంతో పాటు రైతులకు అవసరమైన యూరియా సరఫరా కూడా నిలిచిపోకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. యూరియా బస్తాల సరఫరా ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని డీసీపీ పేర్కొన్నారు. అదేవిధంగా రైల్వే వ్యాగన్ల నుంచి యూరియా బస్తాలను



లారీలలోకి ఎక్కిస్తున్న హమాలీల దాహార్తిని తీర్చేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని డీసీపీ బి. రామ్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై నరేష్, వివిధ శాఖల అధికారులు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, హమాలీలు పాల్గొన్నారు.

# స్వర్గీయ రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించిన జన్నారం కాంగ్రెస్ శ్రేణులు

జన్నారం, మే 21(వుదయం విలేఖరి) మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. గురువారం ఉదయం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా నూతన మండల, పట్టణ అధ్యక్షులు నందు నాయక్, మంద రాజేష్ లు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ రెండు పర్యాయాలు భారత ప్రధానిగా పని చేశారని, 40 ఏళ్ల చిన్న వయసులోనే దేశానికి ప్రధాని అయిన యువ నేత అని కొనియాడారు. టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థను అభివృద్ధి చేసి భారతదేశాన్ని ఆధునిక యుగం వైపు నడిపించారని, ఐటీ రంగ పితామహుడిగా, టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడిగా, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా ఆయన ముద్ర ఎన్నటికీ చెరగదని తెలిపారు. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నందు నాయక్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ,పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్సాక్, జిల్లా కార్యదర్శి ముజాఫర్,వర్తక సంఘం అధ్యక్షులు వోజ్జల వామన్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బెడద సత్తయ్య, రోటిగూడ ఉపసర్పంచ్ గాజుల సత్తయ్య, పాదం రాకేష్, మాజీ జెడ్పిటిసి పంకజ,సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కడెం రిజర్వాయర్‌లో బార్న్ స్వాలో పక్షుల అరుదైన మట్టిగూళ్ల కాలనీ గుర్తింపు

ఖానాపూర్, మే 21(వుదయం విలేఖరి) ఖానాపూర్ నియోజకవర్గం,కడెం రిజర్వాయర్ పరిధిలోని మిషన్ భగీరథ పంప్ హౌస్ నిర్మాణం కింద బార్న్ స్వాలో పక్షుల అద్భుతమైన మట్టిగూళ్ల సమూహాన్ని డాక్టర్ వెంకట్ అనగంధుల గుర్తించారు. మానవ నిర్మిత వాతావరణాల్లో ఈ పక్షుల గూడు నిర్మాణ నైపుణ్యాన్ని, సామూహిక జీవన విధానాన్ని ఈ పరిశీలన ప్రతిబింబిస్తోంది. డాక్టర్ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం, బార్న్ స్వాలోలు పంప్ హౌస్ సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాల కింద వందల సంఖ్యలో మట్టిగూళ్లను గుంపులుగా నిర్మించాయి. ఒకే ప్రదేశంలో అనేక గూళ్లను సమీప సమీపంగా నిర్మించడం ద్వారా ఈ పక్షులు తమ సమూహ జీవనశైలిని ప్రదర్శిస్తున్నాయి. ఆ ప్రాంతం వీటి సంభోగం,పిల్లల పెంపకానికి అనుకూలమైన జీవావరణంగా ఉన్నట్లు ఇది సూచిస్తోంది. గూడు నిర్మాణ నైపుణ్యం: బార్న్ స్వాలోలు తడి మట్టి, గడ్డి తంతువులు, రెక్కలు, ఇతర సహజ పదార్థాలతో కప్పు ఆకారంలో బలమైన గూళ్లను నిర్మిస్తాయి. తమ ముక్కులతో వందలాది మట్టి గడ్డలను తీసుకొచ్చి కాంక్రీట్ ఉపరితలాలకు గట్టిగా అంటించి గూడును పూర్తి చేస్తాయి. ఈ గూళ్లు గాలి, వర్షం, వాహనాల కంపనలు, మానవ కదలికలను కూడా తట్టుకుంటాయి. ఎందుకు ఇక్కడే?: వంతెనలు, కల్వర్టులు, పంప్ హౌస్‌లు వంటి ఎత్తైన కాంక్రీట్ నిర్మాణాలు పాములు, ఎలుకలు, అడవి పిల్లులు వంటి మృగాల నుండి రక్షణ కల్పిస్తాయి. తీవ్ర వేసవిలో చల్లదనాన్ని ఇస్తాయి. దీంతో గుడ్ల సంరక్షణ,పిల్లల పెరుగుదలకు అనుకూలంగా మారుతాయి. పర్యావరణ ప్రాముఖ్యత: కడెం రిజర్వాయర్ పరిసరాల్లో లభించే విస్తృత ఆహార వనరులు పెద్ద కాలనీ ఏర్పాటుకు



కారణమని డాక్టర్ వెంకట్ తెలిపారు. బార్న్ స్వాలోలు దోమలు, ఈగలు, ఇతర ఎగిరే కీటకాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సహజ కీటక నియంత్రణలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. పర్యావరణవేత్తలు, పక్షి ప్రేమికులు ఈ అరుదైన గూడు సమూహం నమోదుపై ఆనందం వ్యక్తం చేశారు. మానవ నిర్మాణాలకు వన్యప్రాణులు ఎలా అనుగుణంగా జీవిస్తున్నాయో చూపించే ఉత్తమ ఉదాహరణ ఇదని అభిప్రాయపడ్డారు.
ఈ పరిశీలన కడెం రిజర్వాయర్ పరిసర ప్రాంతాల పర్యావరణ ప్రాముఖ్యతను మరింత స్పష్టం చేస్తోంది.





## రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు ఆదర్శం

నాగిరెడ్డిపేట్,వుదయం మండల కేంద్రంలో మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవతా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, యువత ప్రగతికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువత రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన దూరదృష్టి నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. గ్రామీణ మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు ప్రవేశపెట్టి మహిళా సాధికారతకు బాటలు వేసిన మహానేతగా గుర్తు చేశారు. దేశంలో సమాచార సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసింది రాజీవ్ గాంధీయేనని, ఆయన ఆలోచనల ఫలితంగానే నేడు భారత యువత ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో కీలక స్థానాల్లో కొనసాగుతోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, ఫారుక్, సాయిగౌడ్, లక్ష్మణ్ ఠాగూర్, గంపల వెంకన్న, వజ్రా నాయక్, ప్రభాకర్, సురేందర్ గౌడ్, గులాబ్ హుస్సేన్, మురళి గౌడ్, బాబు, మునిగేపల్లి సంగయ్య, నారాయణరెడ్డి, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్న బడిబాట కార్యక్రమం

### ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని తల్లిదండ్రులకు సూచన "ప్రభుత్వ పాఠశాలే ముద్దు" నినాదాలతో ర్యాలీ





నాగిరెడ్డిపేట్, వుదయం:మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ "ప్రైవేట్ పాఠశాలలు వద్దు -- ప్రభుత్వ పాఠశాలలు ముద్దు" అనే నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు ఎంపీఓ ప్రభాకర్ చారి, గ్రామ సర్పంచ్ గుల్లపల్లి లక్ష్మీనారాయణ ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫాంలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, సన్న బియ్యం, వారానికి మూడు సార్లు గుడ్లు వంటి సౌకర్యాలు అందుతున్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులతో కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు కుటుంబ భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ జయరాజ్, ఎంపీఓ ప్రభాకర్ చారి, కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు జ్యోతి, ప్రతిభ, వార్డు సభ్యులు సిద్ధవ్వ, సాయిబాబా, లాలు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరసింహ చారి కడార్ల నియామకం

జన్నారం, మే 21(వుదయం విలేకరి) అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడార్ల నరసింహ( నరసయ్య) చారి ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారి తెలిపారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతి తరఫున ఎన్నో సంవత్సరాలుగా నిస్వార్థంగా, నిజాయితీగా సంఘానికి సేవలందిస్తున్న వారిని గుర్తించి సముచితమైన స్థానం కల్పిస్తున్నామని నౌండ్ల సంతోష్ చారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నరసింహ చారి కడార్ల కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో విశ్వకర్మ జాతి అభ్యున్నతికి, సంఘం బలోపేతానికి నరసయ్య కృషి చేస్తారని అయన ఆకాంక్షించారు.



